
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.9, కనిష్ఠం 24.1
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 29 జూన్ 2024





ఘనంగా పీవీ జయంతి



పీవీ నరసింహారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

సుభాష్‌నగర్, జూన్ 28: జిల్లా వ్యాప్తంగా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బోర్గాం చౌరస్తాలోని పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా అనేక ఆర్థిక సంస్కరణలు చేశారని కొనియాడారు. అనంతరం తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పీవీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కిరణ్ దేశ్‌ముఖ్, నుడా మాజీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే బోర్గాం(పి) చౌరస్తా వద్ద పీవీ నరసింహారావు విగ్రహానికి మేయర్ నీతూ కిరణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఖిల్లా: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని నగరంలోని వినాయక్‌నగర్‌లో గల పీవీ విగ్రహానికి జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ తెలంగాణ శంకర్ తదితరులు ఉన్నారు.



పీవీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జడ్పీ చైర్మన్



ఏబీవీపీ కలెక్టరేట్ ముట్టడి

- విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఈవోకు వినతి

నిజామాబాద్ అర్బన్, జూన్ 28: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. విద్యాశాఖ కార్యాలయం నూతన కలెక్టరేట్‌లో ఉండటంతో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా జాతీయ ఈసీ మెంబర్, విభాగ్ కన్వీనర్ శివకుమార్, శశిలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లాలో ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ పెరిగిపోయిందన్నారు. జీవో నెంబర్ 1 ప్రకారం పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ డ్రెస్‌లు అమ్మరాదని నిబంధనలు ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిద్ర మత్తులో ఉండి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సునీల్, సాయికుమార్, అమృతచారి, ప్రవీణ్, నాగరాజు, సమీర్, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



కేంద్ర మంత్రితో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ

పెద్దబజార్, జూన్ 28: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను శుక్రవారం ఢిల్లీలో ఎంపీ అర్వింద్ మర్యాదపూర్వకంగా కలిశారు. నిజామాబాద్ నియోజకవర్గ పార్లమెంట్ సమస్యలపై ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించిన అర్వింద్‌కు మంత్రి నిర్మలా సీతారామన్ అభినందనలు తెలిపారు.



'నామినేటెడ్' పై కాంగ్రెస్ నేతల నజర్

- రాష్ట్ర, జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టులపై కాంగ్రెస్ నేతల దృష్టి
- ఎమ్మెల్యేలు, ఇతర నేతల ద్వారా ప్రయత్నాలు
- సామాజిక సమీకరణాల ఆధారంగా పోస్టుల భర్తీ
- ఇదివరకే జిల్లా నుంచి ఐదుగురికి రాష్ట్ర స్థాయి పోస్టులు

నిజామాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల కోసం పోటీ పెరుగుతోంది. పార్టీ సీనియర్ నేతలు పదవుల కోసం ప్రయత్నాలను చేస్తున్నారు. అయితే రాష్ట్రస్థాయిలో రెండో విడత మంత్రివర్గ విస్తరణ పీసీసీ అధ్యక్షుల నియామకం తర్వాతే నామినేటెడ్ పదవులను జిల్లా స్థాయిలో చేపట్టనున్నారు. రాష్ట్రస్థాయిలో ఇప్పటికే నియమించిన చైర్మన్లకు ప్రభుత్వం తరపున జీవో ఇచ్చిన తర్వాతే సామాజిక సమీకరణలతో పాటు పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నేతలకు ఈ పదవులను కట్టబెట్టనున్నారు. మండల, జిల్లా స్థాయిలో వారు చేసిన సేవలను గుర్తించడంతో పాటు వివిధ ఏజెన్సీల ద్వారా సేకరించిన సమాచారం, ఎమ్మెల్యేలతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిల సిఫారసుల మేరకు ఈ నియామకాలను చేయనున్నారు. రాష్ట్రస్థాయిలో పదవులు పూర్తయిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలలోపు జిల్లాస్థాయిలో నామినేటెడ్ పోస్టులను ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ నేతల సమాచారం బట్టి తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలోని కొంత మంది సీనియర్ నేతలకు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వగా మిగతా వారిని పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తవుతున్న సమయంలో పార్టీకి చెందిన నేతలు ఈ నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని నేతలతో పాటు రాష్ట్రస్థాయి మంత్రుల ద్వారా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. తమకు అనుకూలంగా పదవులు వచ్చేందుకు ఈ ప్రయత్నాలను చేస్తున్నారు.

ఇప్పటికే జిల్లా నుంచి ఐదుగురికి పోస్టులు

జిల్లాలో ఇప్పటికే జిల్లా నుంచి ఐదుగురికి రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టులు వచ్చాయి. ఎమ్మెల్యేల కోటాలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీగా నియామకం చేశారు. ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తాహెర్‌బిన్ హందాన్‌ను నియమించారు. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లుగా జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్‌లకు అవకాశం ఇచ్చారు. వీరితో పాటు మరికొంత మందికి రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్‌లుగా అవకాశాన్ని ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు చెందిన సీనియర్ నేతలు ఈ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్రస్థాయిలో కీలకమైన పదవుల్లో వీరిని నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావుకు కీలకమైన పదవిని ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, గడుగు గంగాధర్, ధర్మపురి సంజయ్, అరికెల నర్సారెడ్డి, నగేష్‌రెడ్డిలతో పాటు ఇతర నేతలకు కూడా రాష్ట్రస్థాయిలో అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రస్థాయిలో సామాజిక సమీకరణాలు బట్టి జిల్లా నేతలకు అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.

పోస్టుల కోసం ఎదురు చూపులు

జిల్లాస్థాయిలో కీలకమైన నామినేటెడ్ పదవులు ఏళ్లతరబడి ఖాళీగా ఉన్నాయి. పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నేతలు పార్టీ కోసం పనిచేశారు. నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారు. పార్టీ అధికారంలోకి రాగానే కొన్ని పదవులను భర్తీ చేశారు. మరికొన్ని పదవులను రాష్ట్రస్థాయిలో భర్తీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాస్థాయిలో మాత్రం ఇంకా నామినేటెడ్ పదవుల భర్తీ మొదలు పెట్టలేదు. రాష్ట్రస్థాయి పదవుల పంపకం పూర్తయిన తర్వాత జిల్లా స్థాయిలో మొదలు పెట్టనుండటంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు ఎక్కువగా ప్రయత్నాలు చేస్తున్నారు. తమ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఇంచార్జిలతో పాటు రాష్ట్రస్థాయి మంత్రుల ద్వారా సిఫారసులు చేయించుకుంటున్నారు. కొంత మంది నేరుగా సీఎం వరకు మంత్రుల ద్వారా వెళ్లి తమకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరుతున్నారు. వీరితో పాటు ఇతర నేతల ద్వారా ఏఐసీసీ ఇన్‌చార్జిల ద్వారా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

రెండో విడత మంత్రివర్గ విస్తరణ తర్వాతే..!

రాష్ట్రస్థాయిలో కీలకమైన రెండో విడత మంత్రి పదవుల భర్తీతో పాటు పీసీసీ అధ్యక్షుడ నియామకం తర్వాతనే నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. ఈ రెండు కార్యక్రమాలు పూర్తయిన తర్వాత జిల్లాస్థాయిలో నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నారు. జిల్లాలో మార్కెట్ కమిటీల పాలకవర్గాలు ఖాళీగా ఉన్నాయి. కీలకమైన నిజామాబాద్ మార్కెట్ కమిటీతో పాటు ఇతర కమిటీలు ఉన్నాయి. వీటితో పాటు నుడా ఖాళీగానే ఉంది. నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు కీలకమైన నుడా పదవికోసం ఎక్కువ మంది ప్రయత్నాలను చేస్తున్నారు. వీటితో పాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్, దేవాదాయ కమిటీలు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన వారితో పాటు దీర్ఘకాలికంగా పార్టీవెంటే ఉన్నవారికి సామాజిక సమీకరణాల ఆధారంగా వీటిని భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో పాటు ఇతర నేతలు సీఎం దృష్టికి తీసుకువెళ్లి కొంత మంది పేర్లను సిఫారసు చేసినట్లు సమాచారం. ఆ లేఖలతో పాటు వివిధ నిఘా వర్గాలు ఇచ్చే నివేదిక ఆధారంగా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. కీలకమైన నేతలకు స్థానిక సంస్థల ఎన్నికలముందే ఈ పదవులు రానుండటంతో గట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా సీనియర్ నేతలను ఈ నామినేటెడ్ పదవుల్లో నియామకం చేయనున్నారు.





- ప్రాజెక్టులోకి 2894 క్యూసెక్కుల నీరు
- జిల్లాలో సరాసరి 13.0 మి.మీ వర్షపాతం నమోదు

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

నిజామాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో స్వల్పంగా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 2894 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1059 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 9.643 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. జూన్ ఆరంభం నుంచి ప్రాజెక్టులోకి 3.250 టీఎంసీల నీళ్లు వచ్చి చేరాయి. గత సంవత్సరం ఇదే సమయానికి ప్రాజెక్టులో 15.567 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు

నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 13.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా మెండోరా మండలంలో 43.1 మిల్లీమీటర్ల వర్షం, అత్యల్పంగా ఎడపల్లిలో 3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 143.7 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 120.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో ఆరు మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం కంటే ఎక్కువగా వర్షం పడింది. జిల్లాలోని 15 మండలాల్లో సగటువర్షపాతం పడింది. జిల్లాలో 11 మండలాల్లో సగటువర్షపాతం కంటే తక్కువ పడింది. ఒక మండలంలో అతితక్కువగా వర్షం నమోదైంది.

ఎస్సారెస్పీ సూపరింటెండెంట్‌గా జాన్‌సుభాకర్



మెండోర: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్‌గా జాన్‌సుభాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన గైని గంగారాం బదిలీపై వెళ్లడంతో జాన్‌సుభాకర్ బాధ్యతలు తీసుకున్నారు. సూపరింటెండెంట్‌ను ఉద్యోగులు సిబ్బంది పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈవో జగదాంటర్, ఏఈ మాణిక్యం, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌గౌడ్, రాజశేఖర్, ప్రవీన్‌గౌడ్, శంకర్, ఎర్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం మరో ఆరు రోజులే!

- ప్రత్యేక అధికారుల నియామకం కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

నిజామాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మండల పరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం మరో ఆరు రోజుల్లో పూర్తి కానుంది. సభ్యుల ప్రమాణ స్వీకారం చేసిన తేదీని బట్టి జూలై 4తో ముగియనుంది. వీరి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించి కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం పూర్తవుతుండటంతో పాలన పరమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేంత వరకు వారి ఆధ్వర్యంలోనే పాలన కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ సంస్థల్లో పాలన కొనసాగగా వారి పదవీకాలం పూర్తయిన తర్వాత అభివృద్ధి పనులతో పాటు ఇతర కార్యక్రమాలన్నీ ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగనున్నాయి. సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 4తో ముగియగా.. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఎన్నికలు జరిగేంతవరకు వారి ఆధ్వర్యంలోనే ప్రస్తుతం అన్ని కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం మండలాలకు ప్రత్యేక అధికారులు పనిచేస్తున్నారు. జిల్లా పరిషత్‌కు సీఈవోతో పాటు ఇతర అధికారులు ఉన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల సభ్యుల పదవీకాలం ముగుస్తే ఆ ఎన్నికలు జరిగేంతవరకు ప్రత్యేక అధికారులను నియమించి కార్యకలాపాలను కొనసాగించాలి. జిల్లాలో కొత్త మండలాలు ఏర్పడకముందు 28 మండలాలకు ఎన్నికలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా పరిషత్‌కు కొత్త సభ్యులు ఎన్నికయ్యేంత వరకు కలెక్టర్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలను చేపట్టనున్నారు. ఆయన ఆధ్వర్యంలోనే కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రస్తుతం అదనపు కలెక్టర్ స్థాయిలో సీఈవో ఉన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం జడ్పీకి వచ్చే నిధుల వినియోగంతో పాటు మండలాల కేటాయింపు, పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యూఎస్, ఇతర ఇంజనీరింగ్ శాఖల ద్వారా పనులు చేపట్టడంతో పాటు నిధులను ప్రత్యేక అధికారుల ద్వారానే ఖర్చు చేయనున్నారు. మండల స్థాయిలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో పనులను పూర్తి చేయనున్నారు. ప్రత్యేకాధికారి నియామకం తర్వాత కలెక్టర్ ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు కొనసాగనున్నాయి.



ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యం

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, జూన్ 28: ఎన్నికలప్పుడు రాష్ట్ర ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను తూచాతప్పకుండా అమలు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో అమలు కాని హామీలిచ్చిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పదేళ్ల కాలంలో ఏ మేరకు అమలుచేశారో వెనక్కి తిరిగి చూసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమలుకు ఎన్నికల కోడ్ అడ్డురావడంతో జాప్యం జరిగిందన్నారు. ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు, 2వంద యూనిట్ల ఉచిత విద్యుత్, ఐదువందలకే గ్యాస్ సిలిండర్ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఈ విషయాలు తెలిసికూడా ప్రతిపక్ష పార్టీలు గగ్గోలుపెట్టడంలో అర్థం లేదన్నారు. వరంగల్ డిక్లరేషన్ ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఆగస్టు 15 వరకు అమలవుతుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ రుణమాఫీ ప్రణాళికలను అధికారులు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పేద కుటుంబాలకు 15 లక్షలు ఏడాదికి కోటి ఉద్యోగాలు ఎటు పోయాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తామన్న డబుల్‌బెడ్‌రూమ్‌లు, దళితులకు మూడు ఎకరాలు, ఇంటికో ఉద్యోగం ఎటుపోయాయని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ హమీలు అమలు చేయకపోతే దీక్ష చేస్తానని ప్రకటించిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ముందుగా కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీని ప్రశ్నించాలన్నారు. దేశ సంపద అందరికీ సంబంధించింది కేవలం గుజరాత్ రాష్ట్రానికి మాత్రమే సంబంధించింది కాదన్న విషయాన్ని మోదీకి గుర్తుచేయాలన్నారు. రాకేష్‌రెడ్డి తన స్థాయికి మించి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నాడన్నారు. వ్యక్తిగత ఏజెండాతో పనిచేస్తానని ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలకు చెప్పి ఎమ్మెల్యేగా గెలిచిన రాకేష్ రెడ్డి ఆరునెలలు దాటినా ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. ఆచితూచి మట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, బోనగిరి భాస్కర్, జిల్లా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, రాజేంద్ర ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యుడు పాష, మాజీసర్పంచ్ బద్దం రమేష్ రెడ్డి పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న మానాల మోహన్ రెడ్డి

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయండి

● ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన చేపూర్ వీడీసీ సభ్యులు

ఆర్మూర్‌రూరల్, జూన్28: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం అక్రమంగా చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని శుక్రవారం ఆర్డీవో రాజాగౌడ్‌కు చేపూర్ వీడీసీసభ్యులు, గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. చేపూర్ గ్రామశివారులో సారంగి పెద్ద సాయన్న, విజయ్‌లు గతంలో రెవెన్యూ అధికారులతో కలిసి కుమ్మక్కై స్మశాన వాటిక భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు. ఈ భూమి విషయమై గతంలో కోర్టు స్మశానవాటిక, జంబి భూమిగా చెందినదే అని తీర్పు ఇచ్చిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని వీడీసీసభ్యులు, గ్రామ ప్రజలు 25ఏళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. రెండేళ్ల క్రితం ప్రభుత్వం కెనాల్ స్థలంలో వైకుంఠ ధామం నిర్మించిదని, ఆ ప్రదేశంలో ప్రభుత్వం మంజూరు చేసిన బోరు, మోటర్‌ను ధ్వంసం చేసి బోరు రంధ్రాన్ని మూసివేశారని వారు ఆరోపించారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న స్మశాన వాటిక భూమిని, జంబి భూమిని జిల్లా కలెక్టర్ విచారణ జరిపి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని వారు కోరారు. అనంతరం ఏసీపీ బస్వారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ ఇందూర్ సాయన్న, మాజీఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, వీడీసీ అధ్యక్షుడు మెడిపల్లి శ్రీకాంత్, కోశాధికారి రుక్మజీ, శాంతికుమార్, చరణ్, రాజు, దాసరి శ్రీకంత్, నర్సారెడ్డి, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో చిరుతపులి కలకలం

కోటగిరి, జూన్ 28 : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చిరుతపులి కలకలం సృష్టించింది. అటవీ ప్రాంతం నుంచి వచ్చిన చిరుత కొత్తపల్లి మాజీవిండో అధ్యక్షులు సుధీర్ ఇంట్లో కుక్కపై దాడి చేసింది. కుక్క అరుపులు విన్న యజమాని కిటికి తలుపులు తెరిచి చూడగా కుక్కపై చిరుతదాడి చేయడాన్ని గమనించాడు. పెద్దగా అరుపులు వేయడంతో చిరుత పారిపోయింది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. బీట్‌ఆఫీసర్ అరుణ్‌కుమార్ ఘటనాస్థలాన్ని సందర్శించారు. చిరుత పాదముద్రలను సేకరించారు. చిరుత ఏడాదిలోపు వయసు ఉన్నట్లు నిర్థారించారు. గతంలోనూ కొత్తపల్లి గ్రామంలో పలుమార్లు చిరుతపులి సంచరించి కలకలం సృష్టించింది. ప్రస్తుతం నిజాంసాగర్ కాలువ రావడంతో చిరుత అటవీ ప్రాంతంలోకి వెళ్లే పరిస్థితి లేక ఇటు వైపు వచ్చినట్లు అటవీశాఖ అధికారులు భావించారు. చిరుత సంచారంపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరోమారు ఇటు వైపు వస్తే బోను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రతీరోజు ధ్యానం చేయాలి : జడ్పీచైర్మన్

ఆర్మూర్‌రూరల్, జూన్ 28: ప్రతీ రోజు తప్పనిసరిగా ధ్యానం చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. శుక్రవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని శ్రావణ్ గార్డెన్‌లో శ్రీ నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం, పీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ధ్యాన మహా యజ్ఞ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన దాదన్నగారి విఠల్ రావు జ్యోతిప్రజ్వాలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు ధ్యాన, ఆత్మజ్ఞాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. ప్రతీరోజు కార్యక్రమంలో పాల్గొని ధ్యానాన్ని, ఆత్మజ్ఞానాన్ని అందు కోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఎంసీ మేనేజింగ్ ట్రస్ట్ సేతు బాలకృష్ణ, సాయికృష్ణరెడ్డి, తిరుమల గంగారాం, పల్లె గంగారెడ్డి, శ్రీనివాస్, మిట్టపల్లి గంగారెడ్డి, దయానంద్ పాల్గొన్నారు.

క్షయ నివారణ టీకాలపై సిబ్బందికి శిక్షణ

కమ్మర్‌పల్లి, జూన్ 28: మండలంలోని చౌట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి శుక్రవారం బీసీజీ (క్షయనివారణ) టీకాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఇదివరకు చిన్నపిల్లలకు మాత్రమే ఈ టీకాలు ఇచ్చేవారమని, 2025 వరకు టీబీని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా పెద్దలకు సైతం ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని. ఈ ప్రక్రియ ఆగస్టు నెలలో ప్రారంభమవుతుందన్నారు. ముందుగా క్షయ వ్యాధిగ్రస్తుల ఇండ్లలో ఉంటున్న వారికి , 60 సంవత్సరాలు పైబడిన వారికి, పొగతాగేవారికి, డయాబెటిస్ ఉన్నవారికి , పోషకాహారలోపం ఉన్నవారికి ఈ వ్యాక్సిన్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చౌట్‌పల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుప్రియ, హెచ్‌ఈవో సత్యనారాయణ, జిల్లా కో-ఆర్డినేటర్ వరిగౌడ్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య

బోధన్‌రూరల్, జూన్28: ప్రజలు తమ ఇళ్లతో పాటు ఇంటి పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య అన్నారు. శుక్రవారం డ్రై డే, ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆచన్‌పల్లి తదితర వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇళ్లలోకి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి ప్రాంగణాల్లో టైర్‌లలో నీరు, చెడిపోయిన కూలర్‌లలో నీరు, అలాగే వర్షపు నీరు ఆగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటినిల్వల వల్లనే దోమలు అభివృద్ధి చెందుతాయని, దీని వల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్య సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మాక్లూర్, జూన్28 : మదన్‌పల్లి తండాకు చెందిన ప్రకాష్ అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుని తండ్రి మెగావత్ లింబా ఈనెల 8వ తేదీన తన కుమారుడు అదృశ్యమైనట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో మృతుని గురించి ఆరాతీయగా అమ్రాద్ అటవీ ప్రాంతంలో బైక్ కనిపించడంతో చుట్టుపక్కల వెతకగా కుళ్ళిన ప్రకాష్ మృతదేహం కనిపించింది. ప్రకాష్ మానసిక స్థితి బాగోలేక చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు.

విద్యార్థులకు మెడల్స్, నగదు పురస్కారం

కమ్మర్‌పల్లి, జూన్ 28: మండలంలోని కోనసముందర్ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరం ఉత్తమ మార్కులు సాధించిన పదోతరగతి విద్యార్థులకు గ్రామంలోని అమ్మఒడి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ప్రతీ ఏటా విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసి శాలువాలతో సత్కరించి నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.మధుపాల్, ఉపాధ్యాయులు, అమ్మఒడి సంస్థ గౌరవ అధ్యక్షులు అవుసుల సాగర్, అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, సలహాదారులు కుమ్మరి శ్రీకాంత్, వీడీసీ సభ్యులు ఉన్నారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

జక్రాన్‌పల్లి, జూన్28: మండలంలోని అర్గుల్ గ్రామంలో శుక్రవారం పిచ్చికుక్కలు దాడిచేయగా ముగ్గురికి తీవ్రగాయాలు అయినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో ప్రజలు నడుచుకుంటూ వెళ్తుండగా పిచ్చికుక్కలు వెనుక నుంచి వచ్చి దాడి చేస్తున్నాయని గ్రామ స్థులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పిచ్చి కుక్కల బెడద నుంచి రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

26వ వార్డులో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్, జూన్ 28: మున్సిపల్ పరిధిలోని 26వార్డులోని రాజారాంనగర్ కాలనీలో యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. తమ ఇంటి పరిసరాలను శుభ్రం ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం డ్రైనేజీలలో యాంటిలార్వ స్ప్రేను చల్లించారు. నీటి నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్‌బాల్స్‌లను వేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఎస్ఆర్.సుజాత, మున్సిపల్ కమిషనర్ రాజు, సానిటరీ ఇన్స్‌పెక్టార్ మహేష్, పూర్ణమౌళి, ఆనంద్, మెప్మా సీవో రాజలింగం, ఆర్‌పీ సమత పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్ల పట్టివేత

రెంజల్, జూన్ 28: మండల కేంద్రంలోని సాటాపూర్ నుంచి రెంజల్‌వైపు అక్రమంగా తరలిస్తున్న మూడుఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో సాటాపూర్ నుంచి నిజామాబాద్ వైపువెళ్తున్న ఇసుక టిప్పర్లను తన సిబ్బందితో కలిసి స్టేషన్‌కు తరలించి కేసుననమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఎడపల్లి: మండలంలోని సాటాపూర్ గేటు వద్ద మూడుఇసుక టిప్పర్‌లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా మూడు టిప్పర్‌లలో ఇసుక తరలించడంతో వాటిని పట్టుకుని పరిశీలించి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు దుస్తులు, పుస్తకాల పంపిణీ

ఆర్మూర్‌రూరల్, జూన్ 28: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోట్‌పుస్తకాలను మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సి పల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్నా, వార్డు కౌన్సిలర్ జహీర్, టిక్కి శంకర్, వీడీసీ అధ్యక్షుడు దేవేందర్, సత్యం, ఐసీడీఎస్ అధ్య క్షురాలు తార, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పర్వీన్ పాల్గొన్నారు.

సారంగపూర్ ఆలయంలో వేలం పాట

నిజామాబాద్ అర్బన్, జూన్ 28: సారంగపూర్ హనుమాన్ ఆలయంలో ఏడాదిపాటు టెంకాయలు అమ్ముకునేందుకు శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో బి.నర్సింలు లక్షా 85వేలు పాట పాడి వేలంను దక్కించుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా ఒకనెల పాటు వాహన పార్కింగ్‌ను నిజామాబాద్‌కు చెందిన సుష్మిత్‌గౌడ్ 61వేలు చెల్లించి వేలంపాటను దక్కించుకున్నాడు. దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ సుప్రియ పర్యవేక్షణలో వేలం పాటను నిర్వహించారు. ఫిట్‌పర్సన్ వేణు, అర్చకులు శశికుమార్, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్, అటెండర్ నాగరాజులు ఈ వేలంపాటలో పాల్గొన్నారు.

1న ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 28: తెలంగాణ విద్యార్థి ఉద్యమవేదిక ఆధ్వర్యంలో జూలై 1న ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ అజయ్ తెలిపారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ అవార్డులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ విద్యార్థి ఉద్యమవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్ హాజరవుతారని ఆయన తెలిపారు. నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో సోమవారం ఉదయం 10గంటలకు అవార్డుల ప్రదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాజరుకావాలని వారు కోరారు.

బోధన వైద్యుల నిరసన

పెద్దబజార్, జూన్ 28: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట శుక్రవారం బోధన వైద్యులు ఆందోళన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోధన వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ మాదాల మాట్లాడుతూ.. నల్గొండలోని జనరల్ ఆసుపత్రిలో వైద్యుల హాజరును పర్యవేక్షించేందుకు రోజుకు ఆఫీసర్‌ను నియమిస్తూ అప్పటి కలెక్టర్ నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కలెక్టర్‌కు టెరిటరి కేర్ ఆసుపత్రిపై హక్కులు ఉండవన్నారు. ఇప్పటికే వైద్యులను పర్యవేక్షించేందుకు సూపరింటెండెంట్, ప్రిన్సిపల్, డిఎంఇ, ఎంఎంసికి సంబంధించిన వ్యవస్థ ఉందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయికన్న కింది వారు డాక్టర్లను పర్యవేక్షించడం అంటే వైద్యులను అవమానించినట్లేనని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు దినేష్, గోపాల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

'సిబ్బందికి వేతనాలు చెల్లించాలి'

పెద్దబజార్, జూన్ 28: ప్రభుత్వ ఆసుపత్రిలో సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్‌కు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్, కవిత, హైమదీబేగం, భాగ్యలక్ష్మి, రోజ, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదానం

పెద్దబజార్, జూన్ 28: ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ప్రముఖ డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం నగరంలోని రెడ్‌క్రాస్‌లో జమాల్‌పూర్ విఠల్‌వ్యాస్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో దివంగత జర్నలిస్టు విఠల్‌వ్యాస్ 4వ వర్ధంతి సందర్భంగా రక్తదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ధన్‌పాల్ వినయ్, శ్రీశైలం, భరత్, జమాల్‌పూర్ రాజశేఖర్, రెడ్‌క్రాస్ చైర్మన్ ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోటరాజశేఖర్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి శేఖర్, బొబ్బిలి నర్సయ్య, పంచరెడ్డి శ్రీకాంత్, చింతల గంగాదాస్, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఖిల్లా, జూన్ 28: నగరంలోని నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే స్నేహలత అనే యువతి శుక్రవారం తెల్లవారుజామున నుంచి కనిపించడం లేదని తండ్రి సుదర్శన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఉందని శుక్రవారం ఉదయం 6గంటల ప్రాంతంలో చూడగా ఆమె ఇంట్లో కనబడలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. యువతికి సుమారు 21 సంవత్సరాలు ఉంటాయని చుట్టుపక్కల బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేస్తున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

ఉద్యోగ విరమణ సిబ్బందికి సన్మానం

ఖిల్లా, జూన్ 28: జిల్లా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయ సబార్డినేట్‌గా విధులు నిర్వహించిన మాక్లూర్ భూమయ్య సేవలు అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందినప్పుడే ఆ పదవికి న్యాయం చేసిన వారవుతారన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి బి.ఉషా, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావ్, జడ్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లు కబ్జా విషయంలో గొడవ

ఖిల్లా, జూన్ 28: నగరంలోని మాలపల్లిలో గల ఇల్లు కబ్జా విషయంలో ఇరువురి మధ్య గొడవ జరిగి పరస్పర దాడులకు దిగిన ఘటన ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. నగరంలోని హైమద్‌పుర కాలనీకి చెందిన షకీల్ (అలియాస్ బక్రి షకీల్) అనే వ్యక్తి మరికొందరితో కలిసి మాలపల్లిలో ఉన్న లతీఫ్ అనే వ్యక్తికి చెందిన ఇలు ఫొటోలు తీస్తుండగా పక్కింట్లో నివాసం ఉండే అజ్మత్ అనే వ్యక్తితో గొడవ పడ్డారు. దీంతో మాట మాట పెరిగి ఒకరికొకరు దాడులు చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారిని శాంతింప జేశారు. శుక్రవారం అజ్మత్ ఫిర్యాదు మేరకు షకీల్‌పై కేసు నమోదు చేసినట్లు ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు.

ఘనంగా పీవీ నర్సింహారావు జయంతి వేడుకలు

నిజామాబాద్ అర్బన్, జూన్ 28: దేశ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నగర అధ్యక్షుడు కేశవేణు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పివి నర్సింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ప్రజలకు చేసిన సేవలు, సంస్కరణలు ఎన్నటికి మరువలేనివన్నారు. భూసంస్కరణలతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడిన గొప్ప వ్యక్తి పివి నర్సింహారావు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నాకర్, సంతోష్, వేణురాజ్, గంగారెడ్డి, అశోక్, సాయికిరణ్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

హరిద రచయిత సంఘం ఆధ్వర్యంలో...

హరిద రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పివి నర్సింహారావు జయంతి సందర్భంగా నగరంలోని కేర్ కళాశాలలో ప్రత్యేకంగా కవి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి బిఎన్‌బి, కేంద్ర సాహిత్య అకాడమి విజేత రమేష్ కార్తిక్, గంట్యాల ప్రసాద్, వసంత లక్ష్మణ్, ఆరుట్ల శ్రీదేవి, తదితరులు పాల్గొని పివి నర్సింహారావు సాహిత్యలోకానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హరిద రచయితల సంఘం ప్రతినిధులు ఘనపురం దేవేందర్, నరాల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



నగరంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్ మాట్లాడుతూ.. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పీవీ నర్సింహారావు ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసిన ఘనుడని అన్నారు. అనంతరం పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు న్యాలకంటి శంకర్, జీమ్మిరవి, కొక్కెర భూమన్న, అజ్జు, సుంకె శ్రీనివాస్, నటరాజ్, లింబాద్రి, ఫయీం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పట్టించుకోని సీఎం : ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, జూన్ 28: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలన గాలికి వదిలేసి ప్రజాసమస్యలు పట్టించుకోకుండా ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సీటు కాపాడుకోవడం కోసం గడిచిన ఆరు నెలల్లో 11 సార్లు ఢిల్లీకి వెళ్లి సోనియా, రాహుల్ చుట్టూ తిరగడానికి సరిపోయిందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన విద్యుత్ కొనుగోలు కుంభకోణం, కాళేశ్వరం కుంభకోణం, గొర్రెల పంపిణీ, ఫోన్ ట్యాపింగ్ కుంభకోణాల నుంచి కెసిఆర్‌ను కాపాడటానికి బిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయడానికి సోనియాతో రేవంత్ పావులు కదుపుతున్నారని అన్నారు. కీలకమైన శాఖలను రేవంత్ తన దగ్గర పెట్టుకొని విద్యారంగ సమస్యలు గాలికి వదిలి ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించని దుస్థితి ఉందని అన్నారు. ప్రైవేటు పాఠశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాటిపై చర్యలు లేవని రేవంత్, భట్టివిక్రమార్క సొంత నియోజకవర్గాలలో పైలెట్ ప్రాజెక్టుగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. మన నియోజకవర్గాల్లో నేటికి కనీస మౌలిక సౌకర్యాల కల్పన లేదని ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తే పోలీసులు ఏబీవీపీ కార్యకర్తలపైన దాడి చేసి కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు మల్లేష్‌యాదవ్, మాస్టర్ శంకర్, సాయివర్ధన్, సుక్కమధు, విజయ్, నాయకులు లక్ష్మీనారాయణ, భరత్ భూషన్, పల్నాటి కార్తిక్, బద్దం కిషన్, ప్రభాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధన్‌పాల్

మోడల్ స్కూల్‌ను మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే వినతి

ఆర్మూర్‌రూరల్, జూన్ 28: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మోడల్‌స్కూల్ ఆర్మూర్ నియోజకవర్గానికి మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఆర్మూర్‌కు రావాల్సిన ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్‌ను ఇతర జిల్లాలకు తరలించారని, మూడో పైలెట్ ప్రాజెక్టు ఆర్మూర్ నియోజకవర్గానికి కేటాయించాలని ఆయన కోరారు. పైలెట్ ప్రాజెక్టు కోసం ఆర్మూర్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నామని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కోటగిరి, జూన్ 28: కోటగిరి ఉమ్మడి మండలంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని మండల ఆరోగ్యవిస్తీర్ణాధికారి గోవర్ధన్ తెలిపారు. కోటగిరి మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఉమ్మడి మండలంలో 1310 మంది పిల్లలుండగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 11,392 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశామన్నారు. పిల్లల్లో ఆరోగ్య సమస్యలు నివారించేందుకు ఈ మాత్రలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు రోజా, శ్రీదేవి, ప్రమీల, పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమార్ పాల్గొన్నారు.

4 లక్షల 40 వేలకు తైబజార్ వేలం

ఎడపల్లి, జూన్ 28: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే వారాంతపు సంతకు శుక్రవారం నిర్వహించిన తైబజార్ వేలం పాటలో నిజామాబాద్ పట్టణానికి చెందిన మజారుద్దీన్ నాలుగు లక్షల నలభైవేలకు దక్కించుకున్నట్లు గ్రామ ప్రత్యేక అధికారి ఎం.శంకర్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆగరాజు గౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

డొంకేశ్వర్‌లో..

డొంకేశ్వర్, జూన్ 28: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్ర వారం తైబజార్ వేలం పాట నిర్వహించారు. ఎంపీవో కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన వేలం పాటలో వారసంతకు డొంకేశ్వర్ గ్రామానికి చెందిన చింత ప్రశాంత్ రూ.89వేల 500లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శేఖర్‌గౌడ్, వీడీసీ క్యాషియర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పోచారంను కలిసిన రాయకూర్ క్యాంప్ నాయకులు

రుద్రూరు, జూన్ 28: మండలంలోని రాయకూర్ క్యాంప్‌నకు చెందిన నాయకులు మండల కో-ఆప్షన్‌మెంబర్ షేక్‌మస్తాన్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను కలిసి అభినందించారు. పోచారంను కలిసిన వారిలో రమేష్, సుధాకర్, ఐలయ్య తదితరులు ఉన్నారు.

ఒకరి ఆత్మహత్య

బోధన్ రూరల్, జూన్ 28: మండలంలోని పెంటాకలాన్ గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మణ్ (28) అనే వ్యక్తి గురువారం అర్ధరాత్రి తన ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు. గడ్డం లక్ష్మణ్ తాగుడికి బానిసై ఎలాంటి పనులు లేకపో వడంతో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు శుక్రవారం ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, అన్ని కోణాల్లో విచారణ చేపడుతు న్నామన్నారు.

పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల విడుదల

నిజామాబాద్ అర్బన్, జూన్ 28: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1490 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1207 మంది ఉత్తీర్ణత సాధించారు. అత్యధికంగా బాలికలు 83.93 శాతం ఉత్తీర్ణత సాధించగా బాలురు 79.09 ఉత్తీర్ణత శాతాన్ని సాధించారు. జిల్లా మొత్తం సప్లిమెంటరీ ఫలితాలలో 81.01 ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను బిఎస్ఇ.తెలంగాణ.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌లో పదిరోజుల పాటే ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. రీ వేరిఫికేషన్, రీకౌంటింగ్ కోసం అభ్యర్థులు జూలై 8 తేదీ వరకు తగిన ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని రీ వేరిఫికేషన్ కోసం రూ.1000, రీ కౌంటింగ్ కోసం రూ.500 చెల్లించాలని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయిలో వైద్య విద్యార్థుల సత్తా

పెద్దబజార్, జూన్ 28: రాష్ట్రస్థాయి మానసిక వైద్యుల సదస్సులో భాగంగా నిర్వహించిన క్విజ్‌లో నిజామాబాద్ వైద్య విద్యార్థులు సూర్య, అబ్దుల్ రఫీ ఉత్తమ ప్రతిభకనబర్చారు. ఈనెల 22, 23న జరిగిన కార్యక్రమంలో మొదటి స్థానంలో నిలిచారు. దీంతో వీరు బెంగ్లూర్‌లో జరుగుతున్న సౌత్‌జోన్ క్విజ్‌కు ఎంపికయ్యారు. వీరిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో మానసిక వైద్య విభాగాధిపతి శివప్రసాద్, వైద్యులు రాజేందర్, రాజశేఖర్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

'సిబ్బంది దురుసు ప్రవర్తనతో ఇబ్బందులు'

పెద్దబజార్, జూన్ 28: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులతో దురుసుగా ప్రవర్తించడం వల్ల ఇబ్బంది పడుతున్నారని ఐద్వ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుజాత తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సమస్యలపై పరిష్కరించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అందాల్సిన కనీస మెడిసిన్ సదుపాయాలు లేవని, గర్భిణులకు సంబంధించి స్కానింగ్ సెంటర్‌లలో తప్పుడు రిపోర్టులు రావడం, వారికి రక్త స్రావం అవుతున్నా కూడా నిర్లక్ష్యం వహించడం వల్ల నిరుపేదలు భయభ్రాంతులకు గురై డిచ్చార్జ్ చేయకుండానే ప్రవేటు ఆసు పత్రులకు వెళ్తున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కూడా సరిగా లేవని ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా చెత్త ఉండటం వల్ల ఆసుపత్రిలోకి రాగానే ఒక రకమైన వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అనిత, ఉపాధ్యక్షురాలు లావణ్య, పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాలను వినియోగించుకోవాలి

బోధన్ రూరల్, జూన్ 28: బోధన్‌లోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వ నైపుణ్యాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బహుళ జాతీయ సంస్థ కోసం వచ్చే నెల 3వ తేదిన ఉదయం 9 గంటల నుండి నియామకాలు జరుపబడతాయని ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్ తెలిపారు. బీఎస్సీ, బీకాం, బీసీఏ, ఎంబీఏ, బీటెక్, డిగ్రీ 2022 నుంచి 2024 వరకు పాసైన వారు ఇంటర్వ్యూలకు వచ్చే అభ్యర్థులు అన్ని రకాల సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్‌లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 8978616777 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

వేల్పూర్, జూన్ 28: ఎంపీపీ బీమ జమున అధ్యక్షతన శుక్రవారం జరిగిన చివరి మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా జడ్పీటీసీ అల్లకొండ భారతి రాకేష్‌చంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలస్థాయి ప్రభుత్వ వివిధ శాలకు సంబంధించిన అధికారులు వారి శాఖల పని తీరును సభ్యులకు వివరించారు. సభ్యులు వారి గ్రామాల్లో ప్రజ లు ఎదుర్కొంటున్న సమస్యలు, చేయాల్సిన పెండింగ్‌లో ఉన్నవి అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్ జడ్పీటీసీ, ఎంపీపీ వివిధ గ్రామాల ఎంపీటీసీలను శాలువ పూలమాలలతో వీడ్కోలు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బీమ్‌రావు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ముందుకు సాగాలి : ఎంపీపీ విమల

జక్రాన్‌పల్లి, జూన్ 28: పార్టీలో విభేదాలు లేకుండా ప్రజాప్రతినిధులు అధికారులు మండల పరిషత్ పాలకవర్గసభ్యుల సహకారంతో మండల అభివృద్ధి చేసి ముందుకు సాగాలని ఎంపీపీ కుంచాల విమల రాజు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ కుంచాల విమల రాజు అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండల పరిషత్ పాలకవర్గానికి చివరి సమావేశం అయినందున ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ఎంపీపీ, మండల కో-ఆప్షన్‌సభ్యులు, ఎంపీటీసీలు సమావేశంలో మాట్లాడి గడిచిన ఐదేళ్లలో చేసిన పనులను గుర్తు చేసుకొని అందరు కలిసి మెలిసి ఉందామని గుర్తు చేసుకొని నెమరువేసుకున్నారు. మండల పరిషత్ పాలకవర్గానికి సమావేశంలో ఎంపీపీ కుంచాల విమల, జడ్పీటీసీ తనుజా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ఎంపీపీ తిరుపతిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌ఖాన్, ఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి, సతీష్, మరియా, పోతె రాజు, పద్మ, మున్నూరు గంగాధర్, ఎస్.గంగారెడ్డి, ఎంపీడీవో సతీష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్మయి శాలువ, పూలమాల, మెమొంటోతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి దేవిక, పశువైద్యాధికారిణి శిరిష, ఎంపీవో యుసుఫ్‌ఖాన్, మండల పరిషత్ సూపరిండెంట్ బ్రహ్మానందం, పీఆర్ఏఈ సురేందర్‌వర్మ, ఏపీఎం రవీంధర్‌రెడ్డి, ఏపీవో రవి, పంచాయతీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామ మందిరానికి గంగా జలాలు

వర్ని, జూన్ 28: చందూర్ మండల కేంద్రంలో గల శ్రీరామ మందిరానికి మండల ప్రజలు గంగా జలాలను తీసుకుని వచ్చి అన్ని గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రజలందరు సుఖంగా ఉండాలని దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ అశోక్ యాదవ్, మాజీ చైర్మన్ మాధవ రెడ్డి, పోతరాజు శ్రీనివాస్, కల్లూరి రాంరెడ్డి, గుర్ల సాయిలు, వివిధ సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

హరితహారానికి ఏర్పాట్లు చేయాలి

ధర్పల్లి, జూన్ 28: మండలంలో చేపట్టే హరితహారం కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో బాలకృష్ణ కార్యదర్శులను, ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎంబి సర్వే, ఐహెచ్‌హెచ్ఎల్ సర్వే, సానిటేషన్, ఫిట్టింగ్ అండ్ ప్లానింగ్స్, ఆర్టికల్చర్, ట్రిబుల్ టి రిజిస్ట్రేషన్ మరియు ఇన్సూరెన్స్ తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. సెంట్రల్ టీమ్ మండలానికి విచ్చేసిన సందర్భంగా గ్రామ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైన ప్రస్తుత పరిస్థితుల్లో క్లోరినేషన్, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపివో రాజేష్, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగిఉండాలి

బోధన్‌రూరల్, జూన్ 28: యువత హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి చెడు అలవాట్లకు గురికావద్దని బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సాయి ఆదర్శయువతి మండలి, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ రాజన్న మాట్లాడుతూ, హెచ్ఐవీ, ఎయిడ్స్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఇది అంటువ్యాధి కాదని ఆయన తెలిపారు. దేశం యొక్క భవిష్యత్ యువతపై ఉందని యువత సక్రమ మార్గంలో నడవాలని ఆయన పేర్కొన్నారు. యువత చెడు మార్గాల్లో వెళ్లకూడదన్నారు. హెచ్ఐవీ సోకిన బారిన పడిన వారు భయపడకుండా ప్రభుత్వం కల్పించిన వసతులను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, సాయి ఆదర్శ యువతి మండలి అధ్యక్షురాలు పద్మాసింగ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

బోధన్‌రూరల్, జూన్ 28: బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు 2024-25 సంవత్సరానికి అతిథి అధ్యాపకులుగా బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు, కంప్యూటర్ సైన్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఉర్దూ మీడియం, వాణిజ్యశాస్త్రం బోధించడానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సబ్జెక్టులలో కనీసం 55 మార్కులు ఉండి ఉండాలని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 50మార్కులు పొంది ఉండాలన్నారు. వచ్చే నెల 2వ తేదీ చివరి తేదీ అని సాయంత్రం 4:30 గంటల వరకు అవకాశం ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా బోనాల పండుగ

బోధన్‌రూరల్, జూన్ 28: బోధన్ పట్టణంలో శుక్రవారం గంగపుత్ర సంఘం, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలతో మహిళలు మహలక్ష్మి, పెద్దమ్మ తల్లి, నల్ల పోచమ్మ దేవతలకు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సకాలంలో కురువాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘ నాయకులు కోట అబ్బయ్య, గంగాధర్, భూమయ్య, సుల్తాన్ సాయిలు, దాల్‌మల్క శంకర్, బొంతల గంగాధర్, లక్ష్మణ్, తోకల పశెట్టి, చిన్న లక్ష్మయ్య పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం

రుద్రూరు, జూన్ 28: రుద్రూరు మండల కేంద్రంలోని బొప్పాపూర్ గ్రామంలో జడ్పీటీసీ నారోజి గంగారాం, సురేష్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం కందకుర్తి త్రివేణి సంగమం నుంచి గంగాజలాన్ని తీసుకువచ్చి గ్రామంలోని హనుమాన్ ఆలయం, గజ్జలవ్వ, పోషవ్వ మందిరాలకు వెళ్లి జలాభిషేకం చేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సురేందర్, లచ్చయ్య, దత్తాత్రి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం దర్గా వద్ద పూజలు

రుద్రూరు, జూన్ 28: వర్షాలు సమృద్ధిగా కురావాలని ప్రతియేటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అంబం (ఆర్) గ్రామ అటవీ ప్రాంతంలో గుట్టపై ఉన్న ఖాజా ఘరీబ్ నవాజ్ దర్గాలో శుక్రవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతియేటా దర్గా వద్దకు వెళితే వర్షాలు కురుస్తాయన్న నమ్మకంతో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వెళతామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు రెంజర్ల గంగారాం, గ్రామ కార్యదర్శి రాములు, ఆశం రాము, కుమ్మరి లక్ష్మణ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

మోర్తాడ్, జూన్28: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం డీఐఈవో రవికుమార్ ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పాల్ గంగాధర్, లెక్చరర్‌లు పాల్గొన్నారు.

కోటార్మూర్ వీడీసీ నూతన కార్యవర్గం

ఆర్మూర్‌రూరల్, జూన్ 28: మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. వీడీసీ అధ్యక్షులుగా డిష్‌గంగాధర్, కోశాధికారిగా మామిడి ఏలియ, కార్యదర్శిగా నాగుల శ్రీధర్‌గౌడ్ కార్యవర్గ సభ్యులుగా లక్కరం పెద్ద నారాయణ, గైని చిన్న గంగాధర్, లింబాగౌడ్, నాగరాములు, జక్కుల శ్రీకాంత్, బాలకృష్ణ, శేఖర్, నర్సయ్యలను ఎన్నుకున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నవీపేట, జూన్ 28: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీమేరకు రైతులకు 2 లక్షల రూపాయల రుణమాఫీ చేయడానికి సిద్ధం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీని చేపట్టనుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్‌గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, బాలరాజు గౌడ్, భగవాన్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ఈ వేసవికాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీని చేయిస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల శుక్రవారం మండలంలోని అర్గుల్ సింగిల్‌విండో కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి చిత్రపటాలకు విండో పాలకవర్గ సభ్యులు పాలాభిషేకం చేశారు.